క్లుప్తంగా

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి

మద్దికెర: వేసవిలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి పేర్కొన్నారు. గురువారం మద్దికెరలోని నీటి పథకాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో బోర్లు చెడిపోతే వెంటనే ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. నీటి పథకాలకు సంబంధించి విద్యుత్ సౌకర్యం నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాలలో మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపసర్పంచ్ రామాంజనేయులు వెంట ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి



మిట్టసోమాపురంలో వర్మీ కంపోస్టు తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

నందవరం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మిట్టసోమాపురం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వర్మీ కంపోస్టు యూనిట్లతో గ్రామ పంచాయతీకి సంపద సృష్టించుకోవాలన్నారు. వానపాముల ఎరువు తయారు చేసి రైతులకు సబ్సిడీ ధరకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. అలాగే గ్రామాలలో శుభ్రత పాటించాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. పీఆర్ ఏఈ జయన్న, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ గురుస్వామి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



తారు రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

మద్దికెర: బొజ్జనాయునిపేట నుంచి మద్దికెరకు వేస్తున్న తారు రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ ఏఈ జాకీర్‌హుస్సేన్ సూచించారు. ఆయన గురువారం మండల పరిధిలోని బొజ్జనాయునిపేట వద్ద తారు రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి 4 కి.మీ దూరం గల బొజ్జనాయునిపేటకు రూ.2.75 కోట్లతో తారు రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం రోడ్డును నూతన సాంకేతితతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈయనతో పాటు ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

మురుగును తొలగించారు



డీపీఈపీ పాఠశాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టిన దృశ్యం

మద్దికెర: స్థానిక డీపీఈపీ పాఠశాల వద్ద పేరుకుపోయిన మురుగును గురువారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. మురుగునీటి మధ్య పాఠశాల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి ప్రొక్లెయినర్‌తో శుభ్రం చేశారు. ఈఓ. శ్రీహరి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు కాలువలో వేయడం వల్ల నీరు ముందుకు పారకుండా నిల్వ ఏర్పడి మురుగు పేరుకుపోతోందన్నారు. ప్లాస్టిక్ కవర్లను డ్రైనేజీలో వేయకుండా సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామం జగనన్న కాలనీలో కొద్ది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో విద్యుత్ లేక నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో కాలనీలో నీటి సమస్య తీరింది. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు రాత్రి దర్గాలోనే నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిజిగితాతా దర్గాల్లో, షిర్డిసాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాద, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

మహిమాన్వితుడు గాదిలింగప్ప తాత

- నేటి నుంచి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేసిన దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు



గాదిలింగప్ప తాత ఆలయం (ఇన్‌సెట్)గాదిలింగప్ప తాత ఉత్సవమూర్తి

ఆలూరు: భక్తుల కొంగు బంగారం, ఆపదలో ఉన్న వారి దైవంగా వెలుగొందుతున్న గాదిలింగప్ప తాత ఉత్సవాలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో కొలువుదీరిన గాదిలింగప్ప తాత ఉత్సవాలను ఈ నెల 23వ తేదీ నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభించి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో అధికంగా కురుబ కులస్తులు ఉన్నారు. వీరందరూ గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవారు. అయితే కర్ణాటక రాష్ట్రంలోని మల్లివసిగేరి గ్రామంలో గాదిలింగప్ప తాత జన్మించారు. చిన్నతనం నుంచే దైవచింతన, ఆధ్యాత్మికతతో మెలుగుతూ వచ్చారు. ఇక్కడే ఉంటే లింగప్ప భవిష్యత్తుకు ఇబ్బందిగా ఉంటుందని కుటుంబ సభ్యులు భావించి అంబమ్మ దేవాలయం వద్దకు పంపారు. అక్కడ ప్రత్యేక యోగా ధ్యానంలో శిక్షణ పొందారు. అక్కడ సరిపడక అంబమ్మ అవధూత గూళ్యం గ్రామంలో వీరశైవ లింగాయత్ కులానికి చెందిన యోగి శ్రీ సిద్ధప్పయ్య తాత వద్దకు వెళ్లి శిష్యరికం చేయాలని సూచించారు. అక్కడ శిష్యరికం పొందిన గాదిలింగప్ప తాత అనేక మహిమలతో అగ్రజుడిగా ఆరితేరారు. గ్రామంలోని కురుబల వద్ద గొర్రెల కాపరిగా కొనసాగుతూ ఎన్నో మహిమలను చూపారు. అనంతరం పరమపందించిన తర్వాత గ్రామస్తులు, భక్తులు ఆయన ఆలయాన్ని నిర్మించి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొక్కులు తీర్చుకునేవారు నైవేద్యంగా వండిన మాంసం, మద్యం, పూలు, టెంకాయలను సమర్పించి కోర్కెలను కోరుకుంటారు.

జోడు రథోత్సవాలు ఇక్కడి ప్రత్యేకత

ఆలయంలో మూడు రోజుల పాటు భక్తుల నడుమ అంగరంగా వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 23న ఉదయం 9 గంటలకు ప్రభోత్సవం, 24న 6 గంటలకు గురు శిష్యులైన సిద్ధప్పయ్య తాత, గాది లింగప్ప తాత జోడు రథోత్సవాలను ఆలయం నుంచి ఎదురు బసవన్న గుడి వరకు లాగనున్నారు. 25న ఉత్సవ ముగింపు, పూర్ణాహుతి కార్యక్రమాలతో పూర్తి చేస్తారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు



గాదిలింగప్ప తాత ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వీరికోసం దేవస్థానం ఆవరణలో నిర్మించిన అన్నదాన సత్రాలలో వసతి కల్పిస్తున్నాం. మరికొందరికి ప్రత్యేకంగా గదులు కేటాయిస్తున్నాం. భక్తులకు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో బారికేడ్లు, అన్నప్రసాదాలు ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యార్థం మూడు టికెట్ కౌంటర్లు ప్రారంభించాం.

– రాధాకృష్ణ, ఈఓ

సంతాన వరదా.. శ్రీరంగనాథ



పులికొండలోని రంగనాథ స్వామి ఆలయం



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో కొలువుదీరిన రంగనాథ స్వామి సంతాన వరదుడిగా పేరొందారు. సంతానం కలగని దంపతులు స్వామివారిని దర్శించుకుని ఇక్కడ బస చేయడం వల్ల సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆలయంలో ఈ నెల 24 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పూజా కార్యక్రమాలు

24న శుక్రవారం కలశస్థాపన, పుణ్యాహవచనం, సాయంత్రం అంకురార్పణ, 25న శనివారం స్వామివారికి అభిషేకములు సహస్రనామార్చన, కంకణాధారణ, మహానైవేద్యం, సాయంత్రం పల్లకీ సేవ, ఉపన్యాసములు, 26న ఆదివారం ఉదయం 10:35 గంటలకు వృషభలగ్న శుభపుష్కరాంశమందు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం రథ పూజ, రథాంగ హోమం, బలిహరణం, 4:30 గంటలకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు నందికోల సేవ, కాలక్షేప కార్యక్రమాలు 27న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

గర్భగుడి ముందు భక్తులకు స్టీల్ పైపులతో క్యూలైన్ ఏర్పాటు, వసతి గృహముల నిర్మాణం, స్వామివారి ముఖమండపం, ప్రాకార మండపముల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టారు.

దేవాలయానికి వెళ్లే మార్గం

పత్తికొండ-కర్నూలు రోడ్డులోని కనకదిన్నె గ్రామం నుంచి క్రాస్ రోడ్డు మీదుగా 6 కిలోమీటర్ల దూరంలో స్వామి వారి ఆలయం ఉంది. పత్తికొండ నుంచి వయా కనకదిన్నె మీదుగా పులికొండ గ్రామానికి నేరుగా బస్సు సౌకర్యం కూడా ఉంది.

దక్షిణ, ఉత్తర దర్శన ద్వారాలు

దక్షిణ ద్వారం గూండా స్వామి వారిని నిత్యం భక్తులు దర్శించుకుంటారు. వైకుంఠ ఏకాదశి నాడు స్వామి వారిని దర్శించుకోవడానికి నూతనంగా ఉత్తర ద్వార దర్శన ప్రాకారాన్ని ఏర్పాటుచేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



హాజరైన మూడు మండలాల నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

పత్తికొండటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల పార్టీనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పత్తికొండ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. గ్రామాల వారీగా పట్టభద్ర ఓటర్లు, ఉపాధ్యాయులను కలసి మద్దతు కోరాలన్నారు. ఎవరి పరిధిలో వారు సైనికుల్లా పనిచేస్తేనే విజయం సాధిస్తారన్నారు. అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తనను కుటుంబసభ్యుడిగా భావించి గెలుపునకు సహకరించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నిబద్ధత కలిగిన కార్యకర్తగా పనిచేస్తానని, గెలిచిన తర్వాత అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ నారాయణదాసు, జెడ్పీటీసీ సభ్యులు ఉరుకుందమ్మ, మురళీధర్‌రెడ్డి, పులికొండ నాయక్, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, సర్పంచులు పొట్లపాటి ప్రవీణ, శ్రీరాములు, అంజినయ్య, కేశవరెడ్డి, నాగప్ప, రహిమాన్, ప్రభాకర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కరనాయక్, మండల కన్వీనర్లు జిట్టానాగేశ్, కారం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



గుండ్లకొండ లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ గురుప్రసాద్

ఆలూరు: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఆదోని హౌసింగ్ ఈఈ గురుప్రసాద్ సూచించారు. దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలలో ఎదురవుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈఈ గురుప్రసాద్ మాట్లాడుతూ.. నిర్మాణ పనులు వేగవంతం చేసేలా ఆయా లేఅవుట్‌లలో ఇసుక, ఐరన్, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచడంతో పాటు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వచ్చే ఉగాది పండుగ నాటికి అన్ని కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంపీడీఓ గౌరీ దేవి, ఏఈ అనిరుధ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరనాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు

చిప్పగిరి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చిప్పగిరిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 497 మంది పట్టభద్ర ఓటర్లు, 13 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏ, బీ బ్లాకులుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26న కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండల కేంద్రంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు పురస్కరించుకుని ఈ నెల 26న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల వారు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 83747 48453, 93818 31194 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఉత్సవాలు

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండాలో శుక్రవారం మునిస్వామి, చోకాస్వామిల మేటి కుంభోత్సవంతో పాటు రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే మేటి కుంభోత్సవం, పల్లకి ఊరేగింపు జరుగుతాయి. శనివారం మారెమ్మ దేవర కార్యక్రమం ఘనంగా జరుగుతుందని సర్పంచ్ పారుబాయి, ఎంపీటీసీ సంధ్యబాయి తెలిపారు. రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

పాఠశాలకు స్థలం కేటాయించండి

మద్దికెర: మండలంలోని హంప గ్రామం ఎస్సీ కాలనీలో ఆర్డీటీ సహకారంతో పాఠశాల నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, ఇందుకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు చంద్ర, హుస్సేని, శాంతయ్య తదితరులు కోరారు.

ఈ మేరకు గురువారం తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ స్కూలు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు పరిశీలించి అనువైన చోట కేటాయిస్తామన్నారు.

విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: శ్రీకాకుళంలో శనివారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఐఎఫ్‌టీయూ 9వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ అధ్యకుడు రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు.

కాన్షిరాం ఆశయ సాధనకు కృషి

ఎమ్మిగనూరుటౌన్: బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షిరాం ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరిపోగు జైరాజ్, ఎర్రన్న పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం పట్టణంలో ని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం బీఎస్పీ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హొళగుంద: ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన హొళగుంద బీసీ కాలనీకి చెందిన అల్లాబకాష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ గురువారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తి తన ఇంటి పక్కనున్న రేకుల షెడ్డులో 40 బస్తాల (20 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యంను అక్రమంగా నిల్వ చేయడంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

తప్పుడు రాతలపై ఆగ్రహం





ఎమ్మిగనూరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పత్తికొండలో...

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తూ ప్రజలను పక్కదోవ పట్టించడం ఈనాడు దిన పత్రికకు తగదని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసం వద్ద ఈనాడు దినపత్రిక ప్రతులను మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కలిసి దహనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసేందుకు అసత్య రాతలు రాస్తున్న ఈనాడు పత్రిక, అధిపతి రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి యూకే వీరేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్ బజారి, నాయకులు కాశీవిశ్వనాథ్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాబుఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల ఈనాడును బహిష్కరించాలి

పత్తికొండటౌన్: అబద్ధాలను వార్తలుగా ప్రచురిస్తూ జర్నలిజం విలువలను దిగజార్చిన ఈనాడు దినపత్రికను ప్రజలు బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సి.శ్రీరంగడు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.భాస్కర్‌నాయక్, ఎంపీపీ నారాయణదాసు, జెడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి, పులికొండనాయక్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం పత్తికొండలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి ప్రధాన రహదారి పైకి వచ్చి ఈనాడు ప్రతులను ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. అనంతరం వాటిని దగ్ధం చేశారు. రెండేళ్ల క్రితం నాటి టీడీపీ నేత పట్టాభి ఫొటోలతో ఇప్పుడు ఆయన్ను పోలీసులు కొట్టినట్లు ప్రచారం చేయడం ఆ పత్రిక దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జిట్టానాగేశ్, కారం నాగరాజు, అట్లా గోపాల్‌రెడ్డి, నలకదొడ్డి కృష్ణ, బనగాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో..

'జర్నలిజంలో విషపు చుక్కలు ఈనాడు, ఆంధ్రజ్యోతి'

ఆలూరు రూరల్: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనను జీర్ణించుకోలేక తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు జర్నలిజంలో విషపు చుక్కలుగా మారాయని వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆ రెండు పత్రికల ప్రతులను దహనం చేశారు. తప్పుడు కథనాలు రాసి ప్రజలను మభ్యపెట్టలేరని ఆ పత్రికల యాజమాన్యంపై ధ్వజమెత్తారు. నాయకులు హనుమయ్య, మాధన్న, శ్రీధర్, గోవిందు, కురుకుంద తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



ప్రకృతి వ్యవసాయ కషాయాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన రిలయన్స్,ఆర్డీఫ్, వ్యవసాయ అధికారులు

నందవరం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా పీఓ కుమారస్వామి రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిన్నకొత్తిలి గ్రామంలో గురువారం రిలయన్స్, ఆర్డీఫ్ సంస్థ అధికారుల ఆధ్వర్యంలో ఏడీఏ, ఏఓ మర్రి స్రవంతి కషాయాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులు, పొదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయం, కషాయాల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకం వల్ల ఆహార పదార్థాలు కలుషితమై మనుషుల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు కషాయాల తయారీ విధానంపై అవగాహన కల్పించి వారి అవసరమైన వనరులు, పరికరాలు అందజేస్తామని కుమారస్వామి తెలిపారు. ఆర్డీఫ్ సంస్థ అధికారి భాస్కర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రకృతిలోని వనరులను వినియోగించుకుని ఆరోగ్యవంతమైన వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలన్నారు. రిలయన్స్ సంస్థ అధికారిణి రేఖరెడ్డి, ఏఈఓ సురేంద్రగౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్ కరుణప్ప, ఆర్డీఫ్ కార్యకర్త హుసేని, వీఏఏలు, వీహెచ్‌ఏలు, లీడ్‌ఫార్మర్స్ రవికుమార్, నాగిరెడ్డి నరసప్ప, నాగేష్, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పొలంబడి కార్యక్రమం

వరి పంట సాగులో సస్యరక్షణ చర్యలు పాటించడంతో తెగుళ్లు నివారించవచ్చని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. గురువారం నదికైరవాడి గ్రామంలో సర్పంచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఏఓ మర్రి స్రవంతితో కలిసి వరి పంటలో క్లస్టర్ స్థాయి 'డాక్టర్ వైఎస్సార్ పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించి చిత్రపటాల ద్వారా తెగుళ్లు, శత్రు, మిత్ర పురుగులపై అవగాహన కల్పించారు. చీడ, పీడల నివారణ చర్యలను వివరించారు. వీఏఏలు విజయ్, రామకృష్ణ, లోకపావని, వెంకటేష్, రామమూర్తి, దివ్య, రైతులు పాల్గొన్నారు.

ఊరికి ప్రగతి బాట



నాడు కంకర తేలిన కాత్రికి గ్రామ రహదారి



నేడు కాత్రికి గ్రామానికి వేసిన సీసీ రోడ్డు

ఆలూరు రూరల్: ప్రగతి పరుగులు తీస్తోంది.. అభివృద్ధి అందివస్తోంది.. ఇందులో ఆలూరు మండలం ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో గుంతలమయంగా ఉన్న రోడ్లు ప్రస్తుతం చక్కటి రహదారులుగా రూపుదిద్దుకోవడంతో గ్రామస్తుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. మండలంలోని కాత్రికి గ్రామానికి వెళ్లే రహదారి గత పదేళ్లుగా కంకరతేలి అధ్వానంగా ఉండేది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్తుల వినతి మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.68 లక్షల నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే మండలంలోని అంగస్కల్ గ్రామ రహదారి, అరికెర తండా గ్రామ రహదారి పనులు చురుగ్గ సాగుతున్నాయి. గోతులమయంగా ఉన్న రహదారులకు మహర్దశ రావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగిపోయాయి



గతంలో మా గ్రామ రహదారిలో రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. గత వారం రోజుల క్రితం ఆదోని-బళ్లారి రోడ్డులోని హైవే-167 నుంచి మా ఊరి వరకు సిమెంట్ రోడ్డు వేశారు. ఇప్పుడు ప్రయాణం సులభంగా మారింది. మా గ్రామ రహదారికి కష్టాలు తీరి ప్రయాణ ఇబ్బందులు తొలగిపోయాయి.

– రంగన్న, కాత్రికి గ్రామస్తుడు

గ్రామం అభివృద్ధి చెందుతోంది



ఎన్నో ఏళ్లుగా మా గ్రామంలో నెలకొన్న సమస్యలు తీరుతున్నాయి. ఇటీవలే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారంలో భాగంగా మా గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. గ్రామానికి ప్రధాన సమస్యగా ఉన్న రహదారి నిర్మాణం పూర్తికావడంతో ఎంతో సంతోషిస్తున్నాం. ప్రస్తుత ప్రభుత్వంలో మా గ్రామం అభివృద్ధి చెందుతోంది.

– ఈరన్న, కాత్రికి గ్రామస్తుడు

వేధింపుల కేసు నమోదు

కృష్ణగిరి: కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన బోయ పాండురంగడు, సరోజమ్మ, లక్ష్మిలపై గురువారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కోయిలకొండ గ్రామానికి చెందిన బోయ చంద్రకళను 8 నెలల క్రితం పెద్దటేకూరుకు చెందిన పాండురంగడుకు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లయిన నెల రోజుల తర్వాత నుంచి భర్త అనుమానించడంతోపాటు అత్త, ఆడపడుచు వేధింపులకు గురిచేస్తుండడంతో విషయాన్ని పుట్టింటివారికి చెప్పగా పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ కూడా జరిగిందన్నారు. అయినా వీరిలో మార్పు రాకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వణికిస్తున్న వీధి కుక్కలు



హొళగుందలో సంచరిస్తున్న వీధి కుక్కలు

హొళగుంద: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడదతో జనం వణికిపోతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నాలుగేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. గ్రామంలో కుక్కల దాడులు పెరిగిపోతుండడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఈ నెల మొదటి వారంలోనే దాదాపు 20 మంది వరకు కుక్కకాటుకు గురై హొళగుంద పీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నారు. వీధుల్లో, బస్టాండులో తిరుగుతున్న కుక్కలు ఉన్నట్టుండి పెద్దలతో పాటు చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి నెలా సగటున మండలంలో 4 నుంచి 6 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతుండగా ఇటీవల ఆ సంఖ్య విపరీతంగా పెరిగింది. హొళగుందలో ప్రస్తుతం ఉన్న కుక్కలతోనే ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఇతర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కుక్కలను పట్టుకొచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అంతేగాక వింత వ్యాధులతో కుక్కలు వీధుల్లో తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు.

కనబడని కుక్కల నియంత్రణ చర్యలు

వీధి కుక్కలకు ఏటా సంతానోత్పత్తి నివారణకు వ్యాక్సిన్ చేయాలి. పంచాయతీ అధికారులు వీటిపై దృష్టి సారించాల్సి ఉంది. కొన్నాళ్లుగా అధికారులు ఈ చర్యలు చేపట్టడం లేదు. పశువులు, గొర్రెలు, ప్రజలపై కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. కుక్క కాటుకు ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.